కథానిక

# వెంకయ్య నిరాశ

యం. వై. రెడ్డి

1954వ సంవత్సరములో ఒకానొక శుభ ముహూర్తాన, అభిమానులు (తినుటలో మాత్రము) బంధుమిత్రాదులు – రాబోవు తేనీటి విందును తలుచుకుంటూ సుఖాసీనులై పరివేష్టించి యుండ, మంగళగీతములతో ప్రారంభింపబడిన ఆ హోటలు ప్రక్కనే, ఆరోజే, అదేవిధముగా అందరి సమక్షములో, మాతోపాటు నిరుద్యోగిగా వున్న వనమయ్య కొరకు అతనిమామ, కిళ్ళీకొట్టొకటి తెరిచాడు.

ఆరోజు వనమయ్య కిళ్ళీకొట్టు, మూడు పూవులు ఆరు కాయలు కాచినట్లు వెలిగింది. అలా వెలుగటానికి కారణం: ఆహ్వానితులు, అనాహ్వానితులు (నిరుద్యోగులు చాలమంది అనాహ్వానితులైనను, ఆహ్వానితులవలె డాబుగా ప్రవేశించారని వనమయ్యగారి రిపోర్టు) ఉపాహారాన్ని పీకలవరకు నించి (రెండు పర్యాయములు సేవించుట వలన) కిళ్ళీలు సేవించుచున్నవారై (ఇవి కూడ హోటలువారి ధర్మమేలెండి!) వనమయ్య కిళ్ళీకొట్టు చుట్టూ, నవ్వు ముఖములతో గుమికూడడమే! అంతవరకు హోటలు ముఖము చూడని వారు సహితము ఆరోజు, ఉపాహారాన్ని సేవించి, అవిరామంగా ప్రజాసేవ ఒనరించుచున్న (ఈ మధ్య చాలమంది వ్యాపారస్థులు ఈ సేవ చేస్తున్నామని ప్రచారం చేస్తున్నారు) హోటలువారి ఉపాహార తాంబూలాదులు గ్రహించి, వారిని అమందానంద కందళిత హృదయార విందుల జేసిరని ప్రతీతి.

* * *

అలాంటి, కిళ్ళీకొట్టు దగ్గిర (అప్పుడప్పుడు లోపలకూడా) వనమయ్యగారి నాయకత్వం క్రింద (అందరికీ అయిష్టంగా ఉన్నా, కిళ్ళీకొట్టు దగ్గిర నిలువబతే అవకాశం పోతుందనే భయం చేత, ఒప్పుకోవాల్సి వచ్చింది) ఒక నిరుద్యోగుల ఉపదళము, ప్రతిదినము, అవిఘ్నముగా, నిర్విరామంగా సమావేశమయ్యేది. ఆశ్చర్యపడకండి! ఈ నిరుద్యోగులు ఎస్. ఎస్. ఎల్. సి. తప్పిన బాపతు వారుకారు. అసలు వనమయ్యగారు ఇంటర్మీడియేటు పాసయ్యారు. మిగతా వాళ్ళు, అంతకన్న తక్కువ చదివినవారేం కాదు!

* * *

1955వ సంవత్సరములో ఒకానొక రోజు వెంకయ్య బి. ఏ. (నిరుద్యోగి) ఎనిమిదిన్నరకి హోటలు సమీపానికివచ్చి, నవ్వు ముఖముతో, తన హ్రస్వనేత్రముల (వెంకయ్య నవ్వుచున్నప్పుడు కండ్లు కొద్దిగా తెరిచికొని ఉండునని కొందరు, పూర్తిగా మూసికొని ఉండునని కొందరు, మానవాభ్యున్నతికి అత్యంతావసరమైనట్లు, గంటల తరబడి వాదోపవాదములు చేసేవారు) బరపి ఆశ్చర్యచకితుడయ్యాడు. ఇలా జరగటం, అతని పద్ధెనిమిది నెలలు నిరుద్యోగ జీవితములో ఆరవసారి.

అవును. అలాంటి పరిస్థితిలో ఉన్న ప్రతివాడు ఆశ్చర్యపడక మానడు. ఆరోజు వెంకయ్య బి. ఏ. అర్థగంట ఆలస్యంగా వచ్చాడు. తన ఊహాప్రకారము, కిళ్ళీకొట్టుదగ్గిర నిరుద్యోగ సభలో, వాదోపవాదాలు తీవ్రస్థాయి నందుకొని ఉండవలసింది.

కాని అలా జరగలేదు. ముందురాత్రి తోటి నిరుద్యోగుల తీర్మానము గుర్తుకు తెచ్చుకున్నాడు. ఆ తీర్మానమునకు మనస్సాక్షిగా కొందరు, దైవసాక్షిగా కొందరు, వెరసి అందరూ బద్ధులమైవుందుమని ప్రమాణంచేశారు. ఆ చిత్తు తీర్మాన పాఠమిది: "ప్రపంచములో దాదాపు అందరూ, కిళ్ళీకొట్లమీద అవి చేస్తున్న ప్రజాసేవనైనా గుర్తించకుండా, తమ నీచభావాల్ని ప్రకటిస్తున్నారు. ఈ మధ్య ఒక ఛోటా రాజకీయవేత్త, ఫలానా రాజకీయవేత్తలనుండి కిళ్ళీషాపులవరకు ఎక్కడచూచినా ఫలానా పక్షమే గెలుస్తుందని అనుకుంటున్నారని వ్రాశాడు. అధమ పరిమాణంగా కిళ్ళీకొట్లను తీసికొనుట, కిళ్ళీకొట్ల యజమానులను "నీవు" అని సంభో

దించే దురాచారాలను రూపుమాపుటకొరకై, యీ పట్టణమున అఖిలభారత కిళ్ళీకొట్ల యజమానుల సంఘము శ్రీ వనమయ్యగారి అధ్యక్షతన సమావేశమై తమ నిరసనను ప్రకటించారు."

ఈ చిత్తు తీర్మానాన్ని మరునాడు, అనగా ఈరోజు కూలంకషంగా చర్చించి పత్రికలకు విడుదలచేయాలని ముందు రాత్రి నిర్ణయింపబడింది. ఆ నిర్ణయాన్ని తనొక్కడు తప్ప మిగతావారంతా ఉల్లంఘించారు.

ఆఖరుకు వనమయ్యకూడా కిళ్ళీషాపులో లేడు. ఒక్క నిరుద్యోగి కూడా ఆ పరిసర ప్రాంతాల్లో మచ్చుకైనా లేడు. ఆ సమయంలో ఒక కంఠం అత్యంత పరిచయమైనది, అత్యంత ఆప్యాయంగా పలుకరించింది. కాదు కాదు; పిలిచింది. వెంకయ్య బి. ఏ. తన ఆరడుగుల పదంగుళాల ఎత్తూ నూటరెండు పౌనుల బరువుగల శరీరాన్ని ఆ శబ్దము వస్తూన్నవైపు మరల్చాడు. ఆ కంఠం తాలూకాఫీసులో పనిచేస్తున్న గుమాస్తా నారాయణకు చెందినది. ఆ కంఠం మాట్లాడుతుంటే కొట్లాడుతున్నట్లుంటుంది.

* * *

"ఏమోయ్ వెంకయ్య! నీకోసం; ఎవరికీ చెప్పక. నీకొక్కడికే చెప్పుతున్నానోయ్! ఎవరికీచెప్పకేం?" నారాయణ గొంతులోని గరగర శబ్దం రొద నిలబడింది. "అసలు సంగతి ఏమిటండీ?" రహస్యభేదనము చురుకుగా సాగుతూంది. నారాయణ వెంకయ్య చెవిలో నోరుపెట్టి "తాలూకాఫీసులో నాలుగు ఖాళీలున్నాయి. తొందరగా ఇప్పుడే ఓ దరఖాస్తు పారెయ్. ఈసంగతి ఎవరికీ చెప్పకు." నారాయణ విగ్రహం వీధివైపు మరలి వెడలిపోయింది.

* * *

అసలు రహస్యం యిప్పుడు భేదించబడింది. నారాయణ ఇలాగే, రహస్యమంటూ ప్రతివాడికీ ఈ సంగతి చెప్పుతాడు; చెప్పి ఉంటాడు. ఈ సంగతి తోటి నిరుద్యోగుల కందరికీ ఇతనే చెప్పి ఉంటాడు. అందరు తలో దరఖాస్తూ పట్టుకొని డిప్టీకలెక్టరుగారి ఇంటిముందు పచార్లు చేస్తూంటారని అనుకొని వెంకయ్య బి. ఏ బజారువైపు బయల్దేరాడు.

దారిలో లక్ష్మీదాసు కనిపించారు. అతనివెంబడి పంచాయితీబోర్డు ప్రెసిడెంటుకూడా ఉన్నాడు. అసలు లక్ష్మీదాసువెంబడి ప్రెసిడెంటు లేడు. ప్రెసిడెంటువెంట లక్ష్మీదాసు వినయ విధేయతలతో పోతున్నాడు. బహుశా రెకమండేషనేమో! నడుస్తూ నడుస్తూ అతనొక నవ్వు వెంకయ్య బి. ఏ మీద విసిరి వెళ్ళాడు. అంతే.

దరఖాస్తు వ్రాయటానికో అర్ఠటావు తెల్ల కాగితంకోసం ఫాన్సీషాపులోకి పోయేప్పటికి నిరుద్యోగి "బఠాణి" (అసలు వీనిపేరు ఈశ్వరరావులెండి!) కూడ అందుకోసమే ఉన్నాడు. "ఏరోయ్! బఠాణి! దరఖాస్తు కోసమా ఏం?" అంటూ వెంకయ్య బి. ఎ పలకరించాడు. "అవున్రా అసలు అర్ఠటావు దండుగ పెట్టట మవుతుంది. ఎవడో ఒకడు తోపుడు జనాన్ని (రెకమండేషనంటారు) వెంటేసుకుని అది కాస్తా జేబులో వేసుకుంటాడు. నీకూ నాకూ ఎవరు సహాయం చేస్తారు?"

ఇక అలాగే సాగనిస్తే ప్రభుత్వంమీద విరుచుకు పడతాడని ముందే పసిగట్టి, వెంకయ్య బి. ఏ అక్కడే దరఖాస్తు వ్రాయటం మొదలెట్టాడు. బఠాణి అతని అడుగు జాడలలో నడిచాడు.

* * *

డిప్టీకలెక్టరుగారు తన కొద్దిపాటి ఆఫీసుపని ఇంట్లోనే చూసుకుంటాడు గనుక, ఎప్పుడో ఒకప్పుడుగాని ఆఫీసుకురాడు. తత్కారణంగా బఠాణీ సమేతుడై వెంకయ్య బి. ఎ, డిప్టీకలెక్టరుగారి సందర్శనమున కరుగునప్పటికి దైవప్రసాదమునకు వేచివున్న భక్తుల వలె తోటి దరఖాస్తుదారులు మూడుపదులమంది, ఇంటిముందు ఎండలో, డిప్టీకలెక్టరుగారి దర్శనాపేక్షతో పచార్లు చేస్తున్న దృశ్యాన్ని చూసి వెంకయ్య బి. ఏ ఘక్కున నవ్వాడు. అతని కండ్లను జూచి మిగతావాళ్ళు ఒకటేరొద చేశారు.

వీరందరితోపాటు, పదిగంటల సమయంలో ఎండలో, చింపిరితువ్వాళ్ళచేత తమ ఉత్తమాంగములను రక్షించుకుంటూ, గోడకు చేరగిలబడి పైన చేతులతో నొక చాపను పట్టుకుని, అది తమ తలలపై పడకుండా చేసే ప్రయత్నంలో కాలాన్ని వెళ్లబుచ్చుతూ శవాకారాలతో ముగ్గురు

జవానులున్నారు. వాళ్లు అంటరానివాళ్ళు అవడం చేత అలా బయట పడివుండవలసి వచ్చింది. నాలుగు రోజుల క్రితం, ఈ డిప్టీకలెక్టరుగారు, అధ్యక్షపీఠమునుంచి అస్పృశ్యతా నివారణను గురించి, ప్రేక్షకుల హృదయాలు కరిగేట్లు ఉపన్యసించాడు.

ఆ ఉపన్యాసాన్ని తలుచుకుని, అప్రయత్నంగా నవ్వాడు వెంకయ్య బి. ఏ. మిగతావాళ్ళు ఇతన్ని తేరి పారచూడడంలో నిమగ్నులయ్యారు. అంతటిలో ఒకే ఒక క్షణంలో, అందరినోళ్ళూ కట్టుబడ్డాయి. నిశ్శబ్దం అయిదు నిమిషములు మాత్రము రాజ్యమేలింది. మరుక్షణంలో గుసగుసలు బయలుదేరాయి.

దీనికంతా కారణం డిప్టీకలెక్టరుగారి ఇంటిలోనుంచి ప్రెసిడెంటుగారు ఆయనవెంబడి లక్ష్మీదాసు బయటికి రావడము, గవర్నమెంటు డాక్టరు, ఆయనవెంట వనమయ్య నవ్వుతూ లోపలి కెళ్ళడమే! దీని అర్థం ఏమిటో అందరికీ బోధపడింది. బఠాణీ వెంకయ్య బి. ఏ. చెవిలో "తోపుడు జనం" అనీ కడుపుబ్బి నవ్వాడు. వెంకయ్య బి ఏ. గారి కన్నులు మూసివేయబడ్డాయి.

ఇంకొక గంటసేపు పడిగాపులు పడినమీదట గవర్నమెంటు డాక్టరు, డిప్టీకలెక్టరు నవ్వుతూ బయటికివచ్చారు. వనమయ్య వారి వెంటనే ఉన్నాడు. డిప్టీకలెక్టరుగారు డాక్టరుగారివైపు మందస్మితవదనార విందుడై, తన మాటకు తిరుగు లేదన్నట్లు, ఆ గుమాస్తా ఖాళీ తన సొంత ఆస్తి అయినట్లు, తన ఆ ఆస్తిని వనమయ్యకిచ్చేదనన్నట్లు, ఇంకెవ్వరైనను బి. ఏ. లు కాని, యం. ఏ. లు కాని వచ్చినను లెక్కచేయనని హామీయిచ్చినట్లు వీడ్కోలిచ్చాడు. వనమయ్య ఎవరివైపు చూడకుండా డాక్టరు ననుసరించాడు.

డాక్టరుగారికి వీడ్కోలిచ్చి ప్రస్ఫుటమైన విసుగు సూచనలు తన ముఖమందు సమ్మేళన మొనర్చి "ఏమయ్యా! వందలమంది ఇలా వచ్చిపడితే, ఎవరికిస్తాం ఈ ఉద్యోగం? మీ తాతల సొమ్మేందా? (పాపము శమించుగాక!) సాయంత్రం రండి. మీ దరఖాస్తులు అన్నీ చూస్తాం" ఇలా అంటూనే, ఆయన అదృశ్యమయ్యాడు. దరఖాస్తుదారులు నిరాశా, నిస్పృహలతో స్వగృహములవైపు దారి తీశారు.

ఇంతలో బఠాణీ తాను సేకరించిన విషయాన్ని వెంకయ్యతో ఇలా చెప్పాడు. "అలాగ కాదురా! ఇప్పటికి రెండు ఖాళీలు మన సమక్షంలోనే పూరింపబడ్డాయి. మూడవదికూడ, దాదాపు పూరింపబడినట్లే. ఆఖాళీని, తాసిల్దారువారు అపర ధర్మావతారులై, ఒకనికి దానం చేయటానికి వాగ్దానమిచ్చారట. జనాబ్ మహమ్మద్ గారున్నారు చూడు, ఎస్. ఎస్. ఎల్. సి. మూడవసారి సర్వీస్ కమిషనుకు తగిన మార్కులు లేకుండా పాసయ్యాడే ఆయనగారు, తాసిల్దారును సమీపించారట. ఆయనగారు, ఈయనతో "సరేగాని నీకిచ్చేది, కాకపోతే నీకిక ఇవ్వబోయేది, నెలకు డెబ్బయి రూపాయలుకదా! నీకు 50 రూపాయలే ఇస్తున్నారనుకుని, మిగతా 20 రూపాయలు నాకిచ్చేట్లవుతే, నేను కలెక్టరుగారికి సిఫారసుచేసి, ఆఖాళీ నీకే దక్కేట్లు చూస్తాన"న్నాడుట. మహమ్మదుగారి 20 రూపాయలు సర్వహక్కులతో తాసిల్దారుగారి పరమైపోయాయ్. ఇక, మిగిలింది ఒక ఖాళీ మాత్రమే!"

వెంకయ్య బి ఏ. సాయంత్రము నాలుగు గంటలకు, చివరి ఆశారేఖ కూడా అదృశ్యం అవుతుందనే భయంతో, తన గమ్యస్థానాన్ని చేరాడు. అప్పటికే అందరు, ఇంటిముందు పడిగాపులు కాస్తున్నారు. బఠాణి అప్పటికే రెండు గంటల సేపయిందిట వచ్చి. ప్రపంచంతో సంబంధం లేనివారివలె, ప్రొద్దుటివలెనే, ఆ ముగ్గురు జవానుల బారుతో కుస్తీ సాగిస్తున్నారు.

ఐదుగంటలకు డిప్టీకలెక్టరుగారి దర్శనం, తద్భక్తులకు లభించింది. వెంకయ్య బి. ఎ. దుస్తుల్లో చిరిగిన భాగాల్ని చేతుల్లో కప్పుకుంటూ, మిగతావారు అలాగే చేశారు. ఇంతలో ఆయనగారు మండిపడ్డారు. "ఇంత సోమరిపోతు లవుతే ఎలాగయ్యా? మీరేం పనిచేస్తారు? సాయంత్రం రండీ అంటే, దొరలమాదిరి తయారయ్యారు. ఐదుగంటలకు రావలసింది ఇంకో రెండు గంటల తరువాత పట్టి సోమరి పోతులు."అందరి గుండెల్లో రాళ్ళు పడ్డాయ్! చివరి ఆశారేఖ అంతరించింది.

మరుసటి దినము వనమయ్యగారి కిళ్ళీకొట్టు మూసివేయబడలేదు! (అతని మామ ఉన్నాడుగా) కాని, నిరుద్యోగులు ఆచోటు వినబడేవారక్కడ కోల్పోయారు. వెంకయ్య బి. ఎ. గారు మరుసటి దినము ఆ షాపుదగ్గరికి చేరేటప్పటికి బతాణి బిరుదాంకితులు, ఈశ్వరరావుగారు మాత్రము నిలబడి ఉన్నారు. "ఏమిటిసంగతీ" అంటూ వెంకయ్య బి. ఎ ను పలుకరించాడు. "మిగతా ఒక్క ఖాళీ డిప్టీకలెక్టరుగారి దూరపు చుట్టమట, ఆయనగారిచే ఆక్రమింప బడింది" అంటూ బతాణీ నైరాశ్యంతో, తన శ్రమంతా వృథా అయినందుకు విచారిస్తూ, వ్యంగ్యంగా నవ్వాడు. వెంకయ్య బి.ఎ. ఆదేపట్టణాంలో, ఇలాగే నిరాశ చెందడం ఆరవ సారి.

---

కథానిక

# మరపురాని రోజు

"భరణి"

"మొగలి జడ కుట్టవా అత్తయ్యా?" అంటూ పరుగెత్తుకొచ్చింది రాధ. ఆ పట్టు పరికిణీ గరగరలతోపాటు మొగలిపొత్తు వాసనలు ఘుమ్మున విరజిమ్మినయ్. అవి లక్ష్మి నాసికా రంధ్రాల్లోంచి హృదయంలోకి దూసుకుపోయి గిర గిరా తిరుగుతూ గతాన్ని జ్ఞాపకంచేస్తూ తెలియని అనుభూతితో నింపేసినయ్ హృదయాన్ని. చేతులు మొగలి జడను అల్లుతున్న వన్న మాటేగాని హృదయం యెక్కడో యే దూరప్రదేశాల్లోనో, ముద్దు పలుకులు పలుకుతున్నప్పట్నించి ముగ్ధ అయ్యేవరకు జరిగిన సంఘటనలను తెరలు తెరలుగా జ్ఞాపకంచేస్తూ విహరిస్తోంది.

ఆడుతూ పాడుతూ తిరిగిన ఆ నేలమీద యిప్పుడు కూడా అడుగుజాడ లుంటే! వాళ్ళ చెయ్యీచెయ్యీ కలిపి గెంతుతూ తిరిగిన ఆ పచ్చని పచ్చిక, చిలిపి కయ్యాలాడుకుంటుంటే "అయ్యో! హాయిగా ఆడుకోక యీ పిల్ల అలా పోట్లాడుతుం దేం?" అన్నట్లుగా విచారంగా తలలూపే ఆ చెట్లు, "యీ బాలికకు అనురాగాన్ని హృదయంలో హత్తుకునేటట్లు చేసే వుపాయం బాగా తెలుసునే" అనుకుంటూ వారిని చూస్తూ ఆనందంగా యింకా కవ్విస్తున్నట్లుగా తన వాసనలు విరజిమ్ముతూ కదలాడే ఆ సన్నజాజి మొక్క, రోజూ మాయ కుండా అక్కడపడే వారి అడుగుజాడలకు సాక్ష్యం.

లక్ష్మి చిన్నప్పట్నుంచీ కొంటెపిల్ల! కోపం యెప్పుడు చుర్రున ముక్కుకొస నంటుకుంటుందో యెప్పుడు మాయమౌతుందో తెలిసేదిగాదు. చిన్నప్పట్నుంచి లక్ష్మి కృష్ణమూర్తి ఒక్కచోట తిరిగారు. ఆ చిన్నదొడ్డంతా పచ్చగా గడ్డిపెరిగి చిన్నచిన్న మొక్కలు వుండేవి. ఎప్పుడూ ఆ గడ్డిలో తిరుగుతుండేవాళ్ళు. ఆకాశంమీద విరజిమ్మినట్లు మెరిసేపోయే నక్షత్రాల్లా, ఆ పచ్చని గడ్డిమీద చిన్నచిన్న రంగులరంగులపూలు విరజిమ్మినట్లు నిండుకుని ఆహ్లాదాన్ని యిస్తుండేవి. వర్డ్స్‌వర్త్ డాఫడల్స్‌ను మరిపిస్తుండేవి! ఆ కవి డాఫడల్స్‌ను అంత మనోజ్ఞంగా యెందుకు చిత్రించాడో వాటిని చూచినవాళ్ళకు తెలిసితీరుతుంది. ఆ రంగురంగుల పూలమీద సూర్యుని ఎఱ్ఱటి లేత కిరణాలుపడి మెరిసిపోయేవేళ ఆ పసిహృదయాలు రెండూ పరుగుపరుగున వెళ్ళి వాటిని చేతుల్లోకి తీసుకుని ఆడేవారు. అప్పుడు ఆ పువ్వుల్లోని అందమంతా వాళ్ళ ముఖాల్లో మెరిసిపోతుండేది! ఆ పూలన్నీ కోసి యిద్దరూ గుచ్చాలి. తను పెద్దదండ గుచ్చలేదని తనకు తెలుసు. కాని త్వరగా త్వరగా తన చిన్నచేతుల గాజులు గలగలలాడిస్తూ గుచ్చుతుండేది. ఇంతలో పెద్దదండ గుచ్చకూడ దనుకుంటూనే కృష్ణ పెద్దది గుచ్చేవాడు. నాది పెద్దదండ అనగూడదనుకుంటూనే అనేవాడు. వెంటనే లక్ష్మికి వుడుకుబోతుతనం